క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సూరేపల్లి విద్యార్థిని


బొర్రా గీతికాశ్రీ

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న బొర్రా గీతికాశ్రీ రాష్ట్ర స్థాయి అండర్–11 వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె. శ్రీనివాస శర్మ శనివారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నరసరావుపేట కోడెల శివప్రసాదరావు స్టేడియంలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఆడనుంది. ఎంపికైన గీతికాశ్రీని, శిక్షణ ఇచ్చిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావులను హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు రమణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

హిందీ ప్రచార సభ పరీక్షలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పరీక్షలకు భట్టిప్రోలుతో పాటు చెరుకుపల్లి, కొల్లూరు, వేమూరు మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా హైస్కూల్ హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు వ్యవహరించారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

రేపల్లె: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌లను నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ రేపల్లె సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ అమీన్, కో–కన్వీనర్‌లుగా షేక్ రఫీ, బేతపూడి నాని, జి.శ్రీనివాసరావు, ఎం.లోకేష్, కే.తేజస్విలు ఎన్నికయ్యారు. నగరం మండల కన్వీనర్‌గా జాలాది సునీల్‌కుమార్, కో–కన్వీనర్‌లుగా కట్టుపల్లి సుబ్బారావు, కొవ్వూరి గోపి, పుట్టా బూర్లంకయ్యరెడ్డి, లచ్చి సుబ్బారావు, జాలి ధన్‌రాజ్‌లు, నిజాంపట్నం కన్వీనర్‌గా కాటూరి గుడారయ్య, కో–కన్వీనర్‌లుగా మరకా గోపీ, బొమ్మిడి అంతిరాజులు, ప్రేమ్ సాగర్, సైకం జయంత్, చెరుకుపల్లి కన్వీనర్‌గా అక్కల గణేష్‌రెడ్డి, కో–కన్వీనర్‌లుగా బడుగు రాంబాబు, అంబటి నవీన్‌కుమార్, మామిడి సుధీర్‌బాబు, వేపూరి పాపారావు, మువ్వల సాంబశివరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

15న వాహనాల వేలం

నగరం: మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన కారు, ద్విచక్రవాహనాల వేలం ఈనెల 15న నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో ఈనెల 15న ఉదయం 10గంటలకు వేలం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 25 వాహనాలకు వేలం జరపనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదుచేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నియామకం

బాపట్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా కమిటీ నియామకం శనివారం జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని నియమించారు. పలువురికి పదవులు కేటాయించడం జరిగింది. బాపట్ల కార్యాలయం ఇన్‌చార్జి, కార్యదర్శిగా శీలం సాగర్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కార్యదర్శులుగా మరియమ్మ, జగదీష్ శర్మ, షేక్ నలిని, సాగర్‌లను నియమించినట్లు వెల్లడించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

వెల్లటూరు(భట్టిప్రోలు): పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటి వద్ద చదివించేలా చూడాలని వెల్లటూరు హైస్కూల్ హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరీక్షణరావు మాట్లాడుతూ హైస్కూల్‌లో సాధారణ క్లాసులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల కోసం జిల్లా పరిషత్ పాలకవర్గం ప్రత్యేకంగా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారుజామునే విద్యార్థులను నిద్ర లేపి చదివించేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. అత్యధిక మార్కుల సాధనకై అవలంభించాల్సిన మెలకువలను విద్యార్థులకు తెలియ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం


కక్షిదారులను విచారిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న బాపట్ల మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాధుబాబు

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు
- లోక్‌అదాలత్‌లో 501 కేసులు పరిష్కారం

రేపల్లె రూరల్: కక్షిదారులకు లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం చేకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌కోర్టు హాలులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో 18 సివిల్, 482 క్రిమినల్, ఒక ప్రీ లిటిగేషన్ కేసు మొత్తం 501 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 416 కేసులు పరిష్కారం..

బాపట్ల: జాతీయ లోక్‌అదాలత్‌లో శనివారం మొత్తం 416 కేసులను పరిష్కరించినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాధుబాబు తెలిపారు. ఈ కేసుల పరిష్కారంలో రూ.1,23,38,620లావాదేవీలు జరిగాయని పేర్కొన్నారు. రాజీమార్గమే రాజమార్గంగా భావించి కేసులను పరిష్కారించుకోవాలని చైర్మన్ బి.సాధుబాబు సూచించారు. లోక్ అదాలత్‌లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు ప్రసాదరావు, సభ్యులు బండిరామమూర్తి, ఎ.చలపతిరావు, కె.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు శివారు రెడ్లపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి ఉప్పు చెంచులక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వాలి కృష్ణకుమారి, శివారెడ్డి, మాజీసర్పంచ్ బడుగు ప్రకాశరావుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలోనూ ఇంతగా లబ్ధి పొందలేదని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మూడున్నరేళ్ల కాలంలో అల్లూరు సచివాలయం పరిధిలో రూ.16 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసినట్లు తెలిపారు. గ్రామంలో గడప గడపకు అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. గతంలో రాజకీయ నాయకుడు వస్తున్నాడంటే సమస్యలు స్వాగతం పలికేవని, కానీ ఇప్పుడు సంక్షేమ


పేరలి గ్రామంలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఫలాలతో ప్రతి కుటుంబం కళకళలాడుతోందన్నారు. తొలుత గ్రామంలోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ అధ్యక్షులు షేక్ బాజి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, జెడ్పీటీసీ సభ్యురాలు సురేఖ విజయ్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ మండే విజయ్ కుమార్, పార్టీ నాయకుడు వాలిశివారెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు ఆట్ల ప్రసాద్‌రెడ్డి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, చేబ్రోలు వీరయ్య, చేబ్రోలు రవి కుమార్, సర్పంచ్‌లు యేట్ర అశ్వినిరెడ్డి, శ్యామల నాగిరెడ్డి, మంతెన గంగరాజు, దబ్బుకూటి మాధవరావు, మునీర్, కూసంపూడి దేవేంద్రరాజు, పారె ధనుంజయ యాదవ్, కుంతం ప్రసన్నరాజు, యోహాను, గుమ్మడి సీతయ్య, కొర్లపాటి రాజేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొల్లిపర పద్మజ, ఇన్‌చార్జ్ గ్రామ కార్యదర్శి దాసరి శివకుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేరలిలో గడపగడపకు మన ప్రభుత్వం...

పేరలి(కర్లపాలెం): అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. శనివారం సాయంత్రం పేరలి గ్రామంలో ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాలుగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గొర్రుముచ్చు మీరయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ ధర్మేంద్ర తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల రథసారథి సీఎం జగన్

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- ఇంటూరులో గడప గడపకు మన ప్రభుత్వం

ఇంటూరు(వేమూరు): పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొని రావడం జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు శనివారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసున్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. పేద కుటుంబంలోని పిల్లలు సైతం నాణ్యమైన చదువులు చదివేందుకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచి మొద్దు జీవమణి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, ఎంపీటీసీలు తుమ్మ వెంకట రెడ్డి, కె.ఆనంద్ కుమారి, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ గుమ్మడి రవిరాజ్, మాజీ సర్పంచ్‌లు కుంభం శామ్యూల్, బట్టు మోషే, సొసైటీ అధ్యక్షులు కాజా శంకర్ రెడ్డి, దంతు కృష్ణా రెడ్డి, భీమ వరపు సాంబరెడ్డి, దుండి రాఘవ రెడ్డి, అవుతు ముత్తా రెడ్డి, ఆర్.మోహన్ రెడ్డి, అమ్మిరి రత్నాకర్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కల్యాణమస్తు పథకం పేదలకు ఉపయోగకరం

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

బాపట్ల: వైఎస్సార్ కల్యాణమస్తు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి పేర్కొన్నారు. కల్యాణమస్తుతో 4536మంది తల్లుల ఖాతాలోకి నగదు జమ చేయటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని గాదె తెలిపారు. శనివారం స్థానిక పటేల్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గాదె మాట్లాడారు. వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి వధువు, వరుడు పదోతరగతి చదివి ఉండాలనే నిబంధన ఉండటంతో విద్యాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. జగనన్న విద్యాదీవెనతో ఇతరదేశాల్లో చదువుకునేందుకు చక్కని అవకాశం కల్పించారని చెప్పరు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లలా పాలన కొనసాగిస్తుందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈసమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి, గిరిజా రాణి, చింతా కిషోర్, గంపాల వెంకటరెడ్డి, డేవిడ్, డానియేల్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి

అ'పూర్వ' కలయిక


ఒకనాటి విద్యార్థులకు మరో జ్ఞాపకమైన కలయిక

- అంతా 75 ఏళ్లు పైబడిన వారే
- 1965–68 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల సందడి

తెనాలి: వాళ్లంతా 75 ఏళ్లు పైబడినవారే...ఉద్యోగాలు, వ్యాపారాల్నుంచి రిటైరైనవారు, జవసత్వాలు ఉడిగిపోకుండా నవ యువకులకు ఏమాత్రం తీసిపోకుండా ఏదొక వ్యాపకంలో కొనసాగుతున్న వారే. కాలేజీ రోజుల్లోని నేస్తాలను కలుసుకునేందుకు ఎక్కడెక్కణ్ణుంచో రెక్కలు కట్టుకుని వాలారు. కుటుంబ వివరాల నుంచి, చేస్తున్న వ్యాపకాలను పరస్పరం పంచుకున్నారు. ఆత్మీయ విందును ఆరగించి మళ్లీ కలుద్దామని వీడ్కోలు తీసుకున్నారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీలో 1965–68 సంవత్సరాల్లో బీఎస్సీ ఎంపీసీ చదివిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా చేసి, ప్రస్తుతం అరవింద విద్యాకేంద్రం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పరుచూరి రాఘవేంద్రరావు చొరవతో శనివారం అరవింద విద్యాకేంద్రంలోనే కలుసుకున్నారు. అప్పట్లో మొత్తం 80 మంది విద్యార్థులు కాగా, వయోభారంతో కాలం చేసినవారు, కరోనా కాటేసినవారు, ఇక్కడికి రాలేనివారిని మినహాయిస్తే దాదాపు 23 మంది వరకు ఉన్నారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చేసిన ఉద్యోగం, వ్యాపారాలను గురించి చెప్పుకుని, విశ్రాంత జీవితంలోని కార్యకలాపాలను, కుటుంబ వివరాలను పంచుకున్నారు. వాస్తవానికి రాఘవేంద్రరావు ఆసక్తి ఫలితంగా 2015లోనే తొలిసారిగా వీరంతా కలుసుకోగలిగారు. అప్పటికది వారు డిగ్రీ పూర్తిచేసిన స్వర్ణోత్సవ సంవత్సరం. అప్పట్లో 35 మందికి పైగా హాజరయ్యారు. మరోసారి కలుసుకోవాలన్న భావనతో ఇప్పుడు 23 మంది వరకు రాగలిగారు. వీరిలో హైదరాబాద్‌లో ఉంటున్న బీఎస్ సింగ్ ఒకరు. కేంద్ర సర్వీసు నుంచి రిటైరైన ఆయన ఇప్పుడు సంఘ సేవలో ఉన్నారు. మరొకరు కేసీహెచ్ నారాయణ. హైదరాబాద్‌లోని మాతాపితరుల సేవా కేంద్రం, అమ్మానాన్న అనాథాశ్రమం, బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్, వివేకానంద పబ్లిక్ స్కూలు బోర్డు సభ్యుల్లో ఒకరుగా అనాథలు, మానసిక వికలాంగులైన పెద్దలకు ఆశ్రమం, అనాథ పిల్లలకు చదువులకు సాయపడుతున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడైన టీవీఎస్ శాస్త్రి ఇప్పుడు కళారంగ సేవ చేస్తున్నారు. ఇలా ఒకరి వివరాలు ఒకరు తెలుసుకుని మురిసిపోయారు. జ్ఞాపకాల మూటతో తిరుగుపయనమయ్యారు.

నేటి తరానికి ప్రేరణ కావాలనే...



విశ్రాంత జీవితంలోనూ నవయువకుల్లా సమాజానికి సేవలందిస్తున్న వారి స్ఫూర్తి నేటితరానికి ప్రేరణ కావాలనే భావనతోనే పునఃకలయికకు పూనుకున్నాం. మళ్లీ 2025లో మరోసారి కలిసేందుకు ఇప్పుడే నిర్ణయం తీసుకున్నాం.

– పి.రాఘవేంద్రరావు, తెనాలి

సేవా సంస్థల నిర్వహణతో బిజీ



డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీకి చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్సులో పనిచేశాను. 2014లో రిటైరయ్యాను. ప్రస్తుతం వివిధ సంస్థల ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా ఉంటూ పలు అనాథ తల్లిదండ్రులు, అనాథ పిల్లల విద్య, వసతి వంటి సేవాకార్యక్రమాలు చేస్తున్నాం. సంతోషంగా ఉంది.

–కేసీహెచ్ నారాయణ, హైదరాబాద్

మళ్లీ మళ్లీ కలుసుకుంటాం



పోస్టుమాస్టర్‌గా చేసి రిటైరయ్యా. ప్రస్తుత విశ్రాంత ఉద్యోగుల సంఘంలో ఉంటూ డిసిప్లినరీ మేటర్స్‌లో కన్సల్టెంటుగా సేవలందిస్తున్నా. మా బ్యాచ్ స్నేహితులను మొదట 50 సంవత్సరాలకు 2015లో కలుసుకున్నాం. మళ్లీ ఇప్పుడు మరింత ఆత్మీయంగా కలుసుకున్నాం. మళ్లీ మళ్లీ కలుస్తాం.

–బి.ఎన్. సింగ్, హైదరాబాద్

అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న గౌరీశంకర్

తెనాలి అర్బన్: అమరావతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో శనివారం అబ్దుల్ సత్తార్ ఖాన్ మెమోరియల్ 20–20 అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ రియాజ్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ తమ మామ అబ్దుల్ సత్తార్ ఖాన్ పేరిట క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో వివిధ జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని చెప్పారు. టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న అమరావతి క్రికెట్ టీమ్ సభ్యుల్ని అభినందించారు. కార్యక్రమంలో అమరావతి క్రికెట్ అసోసియేసన్ గుంటూరు, కృష్ణా జిల్లాల ఇన్‌చార్జి హరిదాసు గౌరిశంకర్, కోచ్‌లు షేక్ మాలిక్, రోషన్ కుమార్, బక్కా శివరామకృష్ణ, బండారు మధుసూదన్ పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ



తెనాలి టౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకుడు కిశోర్ గురూజీ ఆదేశానుసారం యోగ సభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. నిష్కామకర్మ యోగంలో భాగంగా సేవా కార్యక్రమాన్ని సీనియర్ యోగ సభ్యుడు భూపతి సహకారంతో నిర్వహించారు. కిశోర్ గురూజీ ఆశయాల్ని వృద్ధులకు వివరించారు. కార్యక్రమంలో యోగ సభ్యులు ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, సీహెచ్.నాగేశ్వరరావు, రాంబాబు, టి.వి.సుబ్బారావు, కోమల, గొడవర్తి సత్యనారాయణ, సాయి వెంకట్ పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో తెనాలి విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్

తెనాలి అర్బన్: జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో తెనాలికి చెందిన జి.శశాంక్‌కు బంగారు పతకం, యశ్వంత్, గీతారామ్, మోక్షిత్, కార్తీక్‌లకు రజత పతకాలు, యుక్తశ్రీకి కాంస్య పతకాలు లభించినట్లు మైటీ స్పోర్ట్స్ అకాడమి జనరల్ సెక్రటరీ జి.అనిల్‌కుమార్ తెలిపారు. పోటీల్ని ఈ నెల 3వ తేదీ నుంచి ఐదు వరకు షిర్డీలో నిర్వహించినట్లు చెప్పారు. వీరందరూ త్వరలో బూటాన్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. తన కార్యాలయంలో శనివారం తెనాలి డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్ విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి జయరామ్ పాల్గొన్నారు.

వైభవంగా బాబాకు అభిషేకం

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీరామసాయి జ్ఞాన మందిరంలో 15వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం శ్రీ అగస్త్యేశ్వర భజన సమాజం విష్ణు సహస్రనామ పారాయణం చేసింది. అనంతరం బాబాకు 108 కలశాలతో అర్చకులు, మహిళలు అభిషేకం నిర్వహించారు. అర్చకులు కారంశెట్టి శ్రీనివాసరావు విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో రామసాయి ట్రస్ట్ అధ్యక్షుడు సంకా సతీష్, ఉపాధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్, కొల్లిపర సీతారామ కోటేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, సంకా సీతారామయ్య, రవికుమార్, అమరేంద్రప్రసాద్, అకరంశెట్టి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న బాలకోటేశ్వరుడు


భట్టిప్రోలులో కొలువైన కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వర స్వామి దేవాలయం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వర స్వామి దేవాలయం మహా శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతుంది. ఈ దేవాలయంలో రెండున్నర శతాబ్దాలకు పైగా వెల్లటూరు వంశీకులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 18 వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా స్వామివార్లకు బిందె తీర్థం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆ రోజు రైతులు పశు సంపదను తీసుకువచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. అద్దేపల్లి, భట్టిప్రోలులోని పురవీధులు శివ నామస్మరణతో మారుమ్రోగుతాయి. భక్తులు కూడా వాహనాలతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

కుష్ఠుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

తెనాలి అర్బన్: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వెప్రా సొసైటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాధిక, ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహిద్ బాషా సూచించారు. జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా వెప్రా సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఫ్లారెన్స్ నైటింగెల్ స్కూలు ఆఫ్ నర్సింగ్‌లో శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉంటే కుష్ఠు వ్యాధిగా భావించవచ్చని, అశ్రద్ధ చేయకుండా వైద్యులకు చూపించుకోవాలని తెలిపారు. సమావేశంలో నర్సింగ్ స్కూల్ కార్యదర్శి యనమాల ఈశ్వర్, మేనేజర్ కమలాకర్, ప్రిన్సిపల్ టి.పెర్సిస్ గోల్డ్ పాల్గొన్నారు.

వర్లి చిత్రకళపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో నవ్య

తెనాలి అర్బన్: పురాతన చిత్ర కళ అయిన వర్లి ఆర్ట్స్‌పై విద్యార్థులంతా అవగాహన కలిగి ఉండాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని వేజళ్ల నవ్య సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో శనివారం వర్లి ఆర్ట్స్‌పై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన వర్లి ట్రైబల్స్‌కు చెందిన కళగా దీన్ని వర్ణించారు. దీని ద్వారా సులభంగా గీతలు, వృత్తాలు, చతురస్రాలు గీయవచ్చని చెప్పారు. వర్లీ తెగవారు మాఘ మాసంలో చేపట్టే వివాహాది శుభకార్యాలు, వైశాఖ మాసంలో చేపట్టే వ్యవసాయ పనుల్ని ప్రారంభించే ముందు తప్పనిసరిగా ఇళ్ల ముందు వర్లీ చిత్రాల్ని వేస్తారని తెలిపారు. చిత్రాల్ని చూడగానే అక్కడ ఏమి జరుగుతుందనేని అర్థం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, స్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే, ఆదిలక్ష్మి, శారద, శిరీష, కృష్ణవేణి పాల్గొన్నారు.